క్లుప్తంగా

చిన్నరేవల్లిని మండలం చేయండి

బాలానగర్: చిన్నరేవల్లిని మండలం చేయాలని పరిసర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఏ మాత్రం అవకాశం ఉన్నా చర్యలు తీసుకుంటామని, కనీసం 7 మంది ఎంపీటీసీల మద్దతు కావాలని అన్నారు. ఆ దిశగా పరిసర గ్రామాల ఎంపీటీసీలతో, సర్పంచ్‌లతో కలిసి వస్తే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: హన్వాడ మండలానికి చెందిన పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. హన్వాడ గ్రామానికి చెందిన నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు సత్యనారాయణ, ఆంజనేయులు, రాఘవేంద్ర, శ్రీశైలం, అనిల్, రమేశ్‌లతో పాటు పలువురు ఉన్నారు. అదే విధంగా తెలంగాణ చౌరస్తాలోని విశ్వ బ్రాహ్మణ సంఘం కార్యాలయం వద్ద గొండ్యాల ఎంపీటీసీ వడ్ల శేఖర్ ఆధ్వర్యంలో లింగనపల్లి గ్రామానికి చెందిన నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో మండలఅధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని ఓబ్లాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు సుదర్శన్, జగదీష్, కృష్ణమోహన్, నరేష్, ఎల్లస్వామి, చంద్రశేఖర్, అశోక్, నిరంజన్‌తో పాటు మరో 30 మంది మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో, అదేవిధంగా నర్సాపూర్ గ్రామానికి చెందిన నాయకులు సర్పంచ్ చంద్రకళ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో డీఎస్పీ



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామిని సోమవారం మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేష్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రతి సోమవారం జరిగే అన్నదాన కార్యక్రమానికి రూ.5116లను డీఎస్పీ విరాళంగా అందజేసినట్లు ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అకౌంటెంట్ అనంతసేన్‌రావు, పాలక మండలి సభ్యులు రాచాల ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి యాదవ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించండి

బాలానగర్: మండలంలో బుడగ జంగం భవనానికి 300 గజాల స్థలంతోపాటు, నిర్మాణానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లెం శ్రీను అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కొప్పెర జంగయ్య, తదితరులు ఈ మేరకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారని, స్థలం అన్వేషించాలని వైస్ ఎంపీపీ వెంకటచారికి సూచించినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. యాదయ్య, సురేష్, దశరథ, నరేష్, నవీన్, సత్యనారాయణ, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: జమిస్తాపూర్‌లో విద్యుత్ ప్రమాదం వల్ల పశువులు మృతి చెందగా..బాధిత రైతులు తిరుపతయ్య, సతీష్‌గౌడ్‌లకు విద్యుత్ శాఖ తరపున ఒక్కొక్కరికి రూ.40 వేలు మంజూరయ్యాయి. ఓబ్లాయిపల్లి రైతువేదికలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం వారికి చెక్కులను అందజేశారు. సర్పంచ్ రామచంద్రయ్య, ఉప సర్పంచ్ మొగులయ్యగౌడ్ పాల్గొన్నారు.


ఇష్టానుసారం చెత్త వేయరాదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో ఎక్కడబడితే అక్కడే చెత్తాచెదారం పారవేయొద్దని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం సూచించారు. సోమవారం మున్సిపాలలిటీలో 23, 40, 42వ వార్డుల పరిధిలోని శివశక్తినగర్, మేకలబండ, షాషాబ్‌గుట్ట తదితర ప్రాంతాల్లో చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు పెరిగి డెంగీ బారిన పడే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కచ్చితంగా తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించడానికి వచ్చిన స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలన్నారు పేర్కొన్నారు.



పెద్దగుట్టకు ఉత్సవ శోభ

- నేటినుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు
- అధిక మాసంతో రెండునెలల పాటు వేడుకలు



బాదేపల్లి పెద్దగుట్ట (ఇన్‌సెట్‌లో..) శయనభంగిమలో రంగనాథస్వామి

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రంలోని 44, 167వ నంబరు జాతీయరహదారులకు కిలోమీటరు దూరంలో ఉన్న బాదేపల్లి పెద్దగుట్ట పై నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా శ్రావణమాసంలో ఆలయంలో నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆయా ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. రెండేళ్ల కిందటి వరకు శ్రావణమాసంలో మాత్రమే ఉత్సవాలు నిర్వహించే ఆనవాయితీ ఉండేది. కానీ ప్రస్తుతం ఆలయంలో దూపదీపనైవేద్యాలు నిర్వహిస్తుండటంతో సెలవుదినాల్లోనూ భక్తుల తాకిడి పెరిగింది. అయినప్పటికీ శ్రావణమాసం పూజలకు ఎంతో ప్రత్యేక ఉంది.

పైకప్పులేని ఆలయం

ఆలయంలో శేషతల్పముపై శయన భంగిమలో రంగనాథస్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. విష్ణుమూర్తి శయన భంగిమలో భక్తులకు దర్శనం ఇచ్చే ఆలయం ఈప్రాంతంలో మరెక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. శయనభంగిమలో స్వామివారు ఉండటంతో ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఏర్పడింది. కాకతీయుల కాలంలో ఈప్రాంతాన్ని పరిపాలించిన సామంతరాజు గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని ఇక్కడ ఉన్న స్వామిని స్మరించుకొంటునే రాశారని ప్రతీతి. రంగనాయకస్వామి ఆలయం పైకప్పు లేకుండానే చూడటం గమనించవచ్చు. ఆలయానికి పైకప్పువేసేందుకు అనేకమార్లు భక్తులు యత్నించినప్పటికి అది కూలిపోవటం జరిగేది. దీంతో పైకప్పు వేయకుండా ఇనుపరాడ్లతో జాలీ ఏర్పాటు చేసి వదిలేశారు.

గుట్టపైకి రోడ్డుమార్గం

గుట్ట 700మీటర్ల ఎత్తులో ఉండటంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా కాలినడకన పైకి చేరుకుంటారు. మొత్తం 1200మెట్లు ఎక్కి ఆలయానికి చేరుకోవాల్సి ఉండటంతో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడేవారు. దీంతో భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి రాష్ట్రంలో సీసీరోడ్డు వేసేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. కొంతమేర రోడ్డు ఫార్మేషన్ చేసి వదిలేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మిషన్‌భగీరథ పథకం ప్రారంభం కావటంతో గుట్టపై వాటర్ రిజర్వాయర్స్ నిర్మించటంతో సీసీ రోడ్డు మంజూరైంది. రూ.1కోటి 50లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. దీంతో గుట్టపైకి వాహనాల్లో చేరుకునేందుకు మార్గం సుగమం అయ్యింది.

విశాలమైన మైదానం

గుట్టపైన విశాలమైన మైదానం ఉండటంతో భక్తులు ఎంతమంది వచ్చినా ఇబ్బందులు తలెత్తవు. రాతి గుండ్లు, చెట్లు, గుండ్ల మధ్యలో ఖాళీస్థలం ఉండటంతో భక్తులు వంటావార్పు చేసుకుని సేదతీరుతుంటారు. భవిష్యత్‌లో రేకులషెడ్‌ల నిర్మాణం చేపట్టేందుకు మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించారు.

మూడు పంటలా.. మూడు గంటలా?



కాకర్లపహాడ్‌లో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సాక్షి నెట్‌వర్క్: ప్రజలు మూడు పంటలు కావాలా, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సరిపోతుందన్న మూడు గంటల కరెంటు కావాలో తేల్చుకుని.. ఎన్నికల్లో మద్దతు తెలపాలని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నవాబుపేట మండలం కాకర్లపహాడ్ రైతువేదికలో రైతులతో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ తీరును బయట పెట్టాయని ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు రాజులుగా మారడం వారికి నచ్చలేదన్నారు. రైతులు గమనించి కాంగ్రెస్ తెలంగాణ నుంచి తరిమికొట్టాలని సూచించారు. రైతులతో కలసి బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ రాజాపూర్ మండలంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు అమలు చేశారని వివరించారు. ఎంపీశ్రీనివాస్‌రెడ్డి పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

⇨ బాలానగర్ మండలం ఉడిత్యాలలో ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడారు. రైతులకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొని అందిస్తున్నాడని వివరించారు. 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. పాలమూర్ ఎత్తిపోతలను చూస్తే కేసీఆర్ గొప్పతనం అర్థం అవుతుందన్నారు. వీరన్నపల్లి నుంచి బాలానగర్ రహదారిని బాగుచేశామని వివరించారు. 75 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉడిత్యాల–సూరారం బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావచ్చిందని వివరించారు. టెంకాయలు కొట్టేది కాంగ్రెస్.. పనులు చేసేది బీఆర్‌ఎస్ అని వివరించారు. కాంగ్రెస్ సమయంలో కరెంట్ ఉంటే వార్త... ఇప్పుడు పోతే వార్త అని ఎద్దేవా చేశారు. జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటాచారి, గిరిజన రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం చండీహోమం



చండిహోమంలో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని సోమవారం లోకకల్యాణార్థం చండిహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం చేశారు. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు బుక్కనారాయణ పాల్గొన్నారు. పాతబజార్ పెద్దగుట్ట వీరభద్రుడి ఆలయంలో భక్తులు అమావాస్య పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవలింగ బలిజల ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా 44వనెంబరు జాతీయరహదారిపై గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికా దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి పూజలు చేశారు.

బకాయిల విడుదలపై జాప్యం తగదు



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం జాప్యం చేయడం తగదని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్లక్ష్యంపై మండిపడ్డారు. 2013లో 0.5 శాతం పీఆర్సీ బాండ్ ఇచ్చారని, 2020 సెప్టెంబర్ 30న కాలపరిమితి ముగిసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. 2017, 2021లలో పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. 50 వేల మంది కార్మికులు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు లీవ్‌ల విషయంలో అన్యాయం చేస్తుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన పోరాటాలు నిర్వహించనున్నట్లు వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు బెనహర్, అనిత పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేష్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ మాట్లాడుతూ గురుకులాల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రభుత్వం మాత్రం వారిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మేనేజ్‌మెంట్ వారీగా ఉన్న గురుకులాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని, ఒక్కో యాజమాన్యంలో ఒక్కో విధానం వల్ల ఇబ్బందులకు గురవుతున్నట్లు వివరించారు. బీసీ గురుకులాల రాష్ట్ర కన్వీనర్ సృజన, గురుకులాల జిల్లా కన్వీనర్ జావెద్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, శ్రీనివాసులు, భాస్కర్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న మురుగు



గండేడ్‌లో కాల్వలో పేరుకుపోయిన మురుగు

గండేడ్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని మురుగు, చెత్త చెదారం పేరుకుపోతోంది. దుర్వాసన వస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెల్పినా ఫలితం లేదని వాపోతున్నారు. కార్మికులు సమ్మెబాట పట్టడంతోనే సమస్య పెరిగిపోయిందని ఆరోపిస్తున్నారు. కాగా మరోవైపు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి మురుగును తొలగించాలని, ట్రాక్టర్‌ను నడిపించాలని తెల్పినా గండేడ్ మండల కేంద్రంలో కూలీలు దొరకడంలేదంటూ చేతులెత్తేశారు. దీంతో తమకు అవస్థలు తప్పడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గమనించి మురుగును తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాటవరమా.. కాకవరమా..?



అడ్డాకుల వైపు వెళ్లే దారిలో ..



భూత్పూర్ వైపు వెళ్లే దారిలో..

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి సంబంధించిన బోర్డును జాతీయ రహదారిపై రహదారి నిర్వాహకులు రెండు రకాలుగా ఏర్పాటు చేశారు. భూత్పూర్ వైపు నుంచి అడ్డాకులకు వెళ్లే దారిలో హైవే పక్కన ఏర్పాటు చేసిన బోర్డులో కాటవరం అని సరిగ్గానే రాయించారు. కానీ అడ్డాకుల నుంచి భూత్పూర్ వైపు వెళ్లే దారిలో సబ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన ఉన్న బోర్డుపై 'కాకవరం' అంటూ రాయించారు. ఊరు ఒకటే అయినా పేర్లను మాత్రం రెండు రకాలుగా ఏర్పాటు చేయించారు. వాస్తవానికి కాటవరం అని రాయించాల్సి ఉంది. గతంలో రెండు బోర్డులపై కాకవరం అని ఉండగా కొన్నాళ్ల కిందట ఒక బోర్డుపై ఖరి చేయించారు. మరో బోర్డుపై మాత్రం కాకవరంగానే ఉంచారు.

కాంగ్రెస్ వస్తే రూ.2లక్షల రుణమాఫీ



అడ్డాకుల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ అమలు చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం ఆయన పర్యటించారు. పార్టీ గ్రామ కమిటీని ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాన్ని ఖిల్లా ఘనపురం మండలంలో తిరిగి చేరుస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులే కనిపిస్తున్నాయని అన్నారు. మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. దేవన్నయాదవ్, శశివర్ధన్‌రెడ్డి, యాదయ్య, బాలకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

చౌడేశ్వరి జయంతి ఉత్సవాలు



పాలమూరు: వీర క్షత్రీయ సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో చౌడేశ్వరి దేవి జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి పల్లకీ సేవ, ఉయ్యాలసేవను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కురుమూర్తి, బాలరాజు, చంద్రమౌళి, నాగరాజు పాల్గొన్నారు.

రైతుల వేదికల వద్ద తీర్మానాలు చేయాలి

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ రైతులకు చేయబోయే కీడు గురించి ముందే బయటపెట్టిన రేవంత్ మాటలు ప్రజలు అంత సులువుగా తీసుకోవద్దని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో జరిగిన కార్యక్రమం అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు ముమ్మరం చేయాలని, అన్ని రైతు వేదికల వద్ద కాంగ్రెస్ బుద్ధి చెప్పేందుకు తీర్మానాలు చేయాలని సూచించారు. పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అందరు కలిసి విజయవంతం చేయాలని సూచించారు.

ఘన నివాళి

జెడ్పీసెంటర్(మహబూనగర్) : మాజీ కౌన్సిలర్ మోహన్‌యాదవ్ భార్య స్వర్ణలత సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆమె పార్థివదేహంపై పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అనంతరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురిని మంత్రి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

నేడు శాంతి ర్యాలీ

జడ్చర్ల టౌన్: మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులకు నిరసనగా నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు విలియంబూత్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వరకు కార్యక్రమం నిర్వహించి, అనంతరం వినతిపత్రం సమర్పించనున్నట్లు వివరించారు. క్రిస్టియన్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దశాబ్దాల పాటు వ్యవసాయానికి సహకారం అందించకుండా రైతులను గోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే అని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సాగుకు మూడు గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టారు. రైతులకు సోమవారం కౌకుంట్లలోని రైతువేదికలో అవగాహన కల్పించారు. రైతులకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనేది రైతులు ఆలోచించాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీ రమాదేవి, వైస్‌ఎంపీపీ సూజాత, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి

అడ్డాకుల: రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతిగా నిలిచారని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతు బంధు సమితి అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తే ఉచిత విద్యుత్ లేకుండా చేస్తారని అన్నారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శెట్టినాయక్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం పొట్లపల్లికి చేరిన పాదయాత్ర



అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

రాజాపూర్: టీపీసీసీ సెక్రెటరీ అనిరుధ్‌రెడ్డి చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర సోమవారం మండలంలోని అగ్రహారం పొట్లపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామాల ప్రజలు ఆయనకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను ఎత్తిచూపేందుకే పాదయాత్ర చేస్తున్నట్లు వివరించారు. పాదయాత్రకు మంచి ఆదరణ లభిస్తోందని వివరించారు. నాయకులు కృష్ణయ్య, వెంకట్, రాములుగౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిల్చొని నిరసన



నవాబుపేటలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు



కోయిల్‌కొండలో ..



చిన్నచింతకుంటలో భిక్షాటన

సాక్షినెట్‌వర్క్: నవాబుపేటలో ఒంటి కాలిపై నిల్చొని పంచాయతీ కార్మికులు సోమవారం నిరసన తెలపారు. జేఏసీ నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చిన్నచింతకుంట మండలంలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేస్తు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వేణుగోపాల్ మద్దతు తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చంద్రన్న, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

⇨ బాలానగర్ మండల కేంద్రంలో కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ కార్మికులు సోమవారం జాతీయరహదారి–44పై రాస్తారోకో నిర్వహించారు. వేతనాలు పెంచే వరకు సమ్మెను విరమించబోమని అన్నారు.

⇨ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి డిమాండ్ చేశారు. మూసాపేటలో సమ్మెకు సోమవారం వారు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అడ్డాకులలోనూ సీఐటీయూ కురుమూర్తి సమ్మెలో పాల్గొని మాట్లాడారు.

⇨ కోయిల్‌కొండలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా నాయకులు వెంకటయ్య, కార్మికులు వీరన్న, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి